క్లుప్తంగా

సూర్యాపేటలో మోస్తరు వర్షం



సూర్యాపేట పట్టణంలోని కేసారం రోడ్డులో కురుస్తున్న వర్షం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో శనివారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడి ఉంది. మధ్యాహ్న 1.30గంటల సమయంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పట్టణంలో దాదాపు 34.9 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

20న కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సివిజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో పెన్షనర్లకు ఈ నెల 20వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులను వెంట తెచ్చుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

మద్దిరాల : వెనుకబడిన రామచంద్రాపురం గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. శనివారం రామచంద్రాపురంలో గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. గత 10 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉబ్బని రఘుపతి, తిరుమలేష్, జాన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి

సూర్యాపేట : ఉపాధి హామీ పనులు చేస్తూ కూలీ మృతి చెందిన ఘటన సూర్యాపేట మండల పరిధిలోని సపావత్‌తండా ఆవాసం జేతునాయక్‌తండాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, ఉపాధి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. జేతునాయక్‌తండాకు చెందిన రమావత్ సేవానాయక్ ఉపాధి హామీ పనుల్లో భాగంగా తండా పరిధిలోని చెరువులో పూడిక తీయడానికి వెళ్లాడు. మట్టి తీస్తుండగా అతడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వెంటనే సేవానాయక్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సేవానాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న నాగలక్ష్మి

భానుపురి : సూర్యాపేట పట్టణానికి చెందిన బోనగిరి నాగలక్ష్మి మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా బంగారు పతకం పొందారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి దత్త పీఠం ఆశ్రమం వారు భగవద్గీతపై ఇటీవల ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించారు. అయితే 25 నిమిషాల్లో భగవద్గీతలోని 18 అధ్యాయాలను ధారాళంగా చెప్పడంతో నాగలక్ష్మి బంగారు పతకం పొందారు.

కృష్ణమూర్తికి బీఆర్ఎస్ నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం వాసి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ తండ్రి మొరిశెట్టి కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శనివారం కృష్ణమూర్తి చిత్రపటానికి తిరుమలగిరి మున్సిపల్ వైస్‌చైర్మన్ సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ దూపాటి అంజలిరవీందర్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాఠశాలలకు 'ఆదర్శ కమిటీలు'

- కాలపరిమితి ముగిసిన ఎస్ఎంసీల స్థానంలో ఏర్పాటు
- పెన్‌పహాడ్ మండలంలోని 32 పాఠశాలల్లో పూర్తయిన కమిటీల ఎంపిక



పొట్లపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపికైన అమ్మ ఆదర్శ కమిటీతో హెచ్ఎం

పెన్‌పహాడ్ : పాఠశాలల్లో ఎస్ఎంసీల స్థానంలో రెండేళ్ల కాలపరిమితికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, 24 ప్రాథమికోన్నత పాఠశాలలు, 2 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసిన కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల సమాఖ్య అధ్యక్షులను అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌లుగా ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా ఆయా గ్రామాల పాఠశాలలకు చైర్మన్‌లుగా ఎంపిక చేసిన గ్రామ సమాఖ్య అధ్యక్షుల లిస్టును ఎమ్మార్వోలకు అందించింది. డీఆర్‌డీఏ అందించిన లిస్టు ఆధారంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్‌ల సమక్షంలో తరగతికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున వివిధ మహిళా సంఘాల సభ్యులను కమిటీల సభ్యులుగా ఎన్నుకున్నారు.

కమిటీ విధులు–బాధ్యతలు..

ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, కన్వీనర్‌గా సదరు పాఠశాల హెచ్ఎంలు వ్యవహరిస్తారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో ప్రధానంగా పాఠశాలల్లో విద్యా అభివృద్ధి, పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ, పాఠశాలలను బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యం, పునరుద్ధరణ పనులు, విద్యుత్ పనులు, విద్యార్థులకు యూనిఫాం కుట్టించడం, మధ్యాహ్న భోజనం, పాఠశాల సిబ్బంది హాజరు పర్యవేక్షణ తదితర బాధ్యతలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు సంబంధించి ఆదర్శ కమిటీల చైర్మన్, కన్వీనర్(హెచ్ఎం) పేరున జాయింట్ అకౌంట్‌లు ఓపెన్ చేసి నిర్వహణను ప్రారంభించారు.

కమిటీల ఎంపిక పూర్తి చేశాం



పెన్‌పహాడ్ మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉన్నతాధికారుల సూచనల మేరకు అమ్మ ఆదర్శ కమిటీల ఎంపిక పూర్తిచేశాం. చైర్మన్‌లతో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు కన్వీనర్‌లుగా వ్యవహరిస్తుండటంతో ఇద్దరి పేర్లతో జాయింట్ అకౌంట్లను తెరిపించాం. పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులు కమిటీల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

– నకిరేకంటి రవి, ఎంఈఓ

వాసవీ మాత జన్మదిన వేడుకలు



కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం వాసవీ మాత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాసవీమాత, గణపతి, నగరేశ్వర స్వామి వార్లకు 108 కలశాలతో పంచామృత అభిషేకాలు చేశారు. 102 ఆర్యవైశ్య గోత్రికులతో ప్రత్యేక కుంకుమార్చన పూజలు చేపట్టారు. వాసవీమాత పారాయణం, శ్రీలలితా మాత పారాయణాన్ని భక్తులు సామూహికంగా పఠించారు. ఆలయ అర్చకులు గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు సింగిరికొండ సురేందర్, సింగిరికొండ రవీందర్, పోలా రాధాకృష్ణ, రాచర్ల కమలాకర్, కలకోట లక్ష్మయ్య, తోట శ్యాం ప్రసాద్, రాచర్ల వెంకటేశ్వరరావు, పబ్బతి వేణుమాధవ్, చల్లా లక్ష్మీకాంత్, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట : మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో ఐకేపీ కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్లలో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి పోవడంతోపాటు గాలిదుమారానికి మామిడి, సపోట, బొప్పాయి, నిమ్మ తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన వరి, ఇతర పండ్ల తోటల రైతుల వివరాలు సేకరించాలని కోరారు. నష్టపోయిన వరికి ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు గోవింద్, నరసింహారావు, వేల్పుల వెంకన్న, దండ వెంకటరెడ్డి, శ్రీకాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 12 నాటికి స్కూల్ యూనిఫాం

- కలెక్టర్ వెంకటరావు



గోపాలపురంలో కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జూన్ 12 నాటికి ఉచితంగా రెండు జతల యూనిఫాం అందజేస్తామని కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో గల గోపాలపురం కుట్టు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. జూన్ 5వ తేదీ వరకు ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫాం అందజేయనున్నట్లు తెలిపారు. యూనిఫాం కుట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల్లో మహిళల ద్వారానే స్కూల్ యూనిఫాం కుట్టించి ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తామన్నారు. కుట్టుపనితో మహిళలు ఉపాధి కోసం బయటకు వెళ్లే అవసరం ఉండదని, తద్వార ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ సెంటర్‌లో 2,255 మంది పిల్లలకు యూనిఫాం కుట్టి అందించనున్నట్లు ఏపీడీ రామ్ సురేష్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని 53,234 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున మొత్తం 1,06,468 యూనిఫాం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఆర్‌డీఏ ఏపీడీ సురేష్, డీపీఎం ఆంజనేయులు, ఏపీఎం వెంకయ్య, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

23, 25న ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

చివ్వెంల : తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివి పది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మిర్యాలగూడ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ హెచ్ఈసీ, సీఈసీ విభాగాల్లో ప్రవేశాలకు ఈ నెల 23న బాలురకు, 25న బాలికలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐలాపురంలోని గిరిజన బాలికల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.దుర్గాభవాని శనివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పదవ తరగతి మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్స్, జిరాక్స్, పాస్‌ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

శునకానికి జన్మదిన వేడుకలు



శునకానికి కేక్ తినిపిస్తున్న యజమాని కుటుంబం

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన లక్ష్మీనర్సింహ టెంట్ హౌజ్ యజమాని నల్లగుంట్ల శ్రీనివాస్–అన్నపూర్ణ దంపతులు వారు పెంచుకున్న కుక్కకు జన్మదిన వేడుకలు నిర్వహించారు. వారు గోల్డెన్ రెడ్రివర్ జాతికి చెందిన 45రోజుల కుక్క పిల్లను తెచ్చి పెంచుతున్నారు. అయితే ఆ కుక్కకు ప్రస్తుతం ఏడాది వయసు పూర్తయింది. దీంతో మొదటి జన్మదిన వేడుకను శుక్రవారం రాత్రి ఘనంగా జరిపారు. చుట్టు పక్కల కుటుంబాలకు చెందిన పిల్లలను పిలిచి వారి సమక్షంలో కేక్ కట్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు సమావేశం



తిరుమలగిరిలో మాట్లాడుతున్న రఘునందన్‌రెడ్డి

తిరుమలగిరి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19న బీఆర్ఎస్‌పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం తిరుమలగిరిలో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూపటి రవీందర్, తెడ్డు భాస్కర్, సురేందర్, పాషా, యాకూబ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి పట్టభద్రులు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. అర్వపల్లిలో శనివారం జరిగిన పట్టభద్రులు, బీఆర్ఎస్ నాయకుల మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తిరుమలగిరిలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కిషోర్ ఏర్పాటు చేసే నియోజకవర్గ పట్టభద్రుల సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మండలంలోని పట్టభద్రులను తీసుకొని సమావేశానికి రావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పొట్టిపాక సైదులు, ఎంపీటీసీ బిక్కునాయక్, వేముల గణేష్, హరిప్రసాద్, సురేష్, ఎల్లంరాజు, సంపతి కిరణ్, గుండె ఈశ్వర్, మల్లేష్, వెంకన్న, విజయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఖమ్మం–నల్లగొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆదివారం తిరుమలగిరిలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి పట్టభద్రుల సమావేశం ఉంటుందని తెలిపారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో గుండగాని అంబయ్యగౌడ్, చిల్లర చంద్రమౌళి, కూరం వెంకన్న, ఈదుల కిరణ్‌కుమార్, యారాల నర్సింహారెడ్డి, చిప్పలపల్లి సోమయ్య, మహేందర్, అనంతుల సత్తయ్య, లాజర్, తీగుళ్ల యాదగిరి పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

భానుపురి : రాష్ట్రంలో రైతులు పండించిన అన్నిరకాల వడ్లకు ప్రభుత్వం క్వింటాకు రూ.500ల బోనస్ ఇవ్వాల్సిందేనని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం అన్యాయమన్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో ఐకేపీ సెంటర్లలో ఉన్న ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్నిరకాల వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, నాయకులు కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్, ఎస్‌కే సయ్యద్, పిడమర్తి లింగన్న, భిక్షం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



మట్టి నమూనా సేకరించే విధానం గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

పెన్‌పహాడ్ : భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని గడ్డిపల్లి కేవీకే మృత్తిక శాస్త్రవేత్త కిరణ్ తెలిపారు. శనివారం మాచారం ఆవాసం అనిరెడ్డిగూడెం గ్రామంలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారైనా ప్రతిరైతు తమ భూమి మట్టి నమూనాను సేకరించి భూసార పరీక్ష చేయించుకోవాలని అన్నారు. భూసారం అనుగుణంగా ఎరువులు వాడాలని తెలిపారు. ఎండాకాలం తొలకరి వర్షాలకు లోతైన వేసవి దుక్కులు చేసుకొని పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వేసుకున్నట్లయితే భూసారం పెరుగుతుందని తెలిపారు. తర్వాత రైతులకు మట్టి నమూనా సేకరించే విధానాలను వివరించారు. రైతులు తమ మట్టి నమూనాలను సేకరించి గడ్డిపల్లి కేవీకేలో ఇచ్చినట్లయితే భూసార ఆరోగ్య పత్రాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డి. ఆదర్శ్, కేవీకే సిబ్బంది బచ్చు వెంకటేశ్వర్లు, జి. సంతోష్, రైతులు జానయ్య, రామయ్య, లింగయ్య, సోములు, సైదులు, దేవయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్డీఆర్, సామేల్ పరామర్శ



తుంగతుర్తిలో పోషం ఉపేంద్రం మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి



తుంగతుర్తిలో పోషం ఉపేంద్రం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



నాగారం : నర్సింహులగూడెంలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలో సుదీర్ఘ కాలంగా పేదలకు వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన ఆర్ఎంపీ వైద్యుడు పోషం ఉపేంద్రం(61) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, నాయకులు కొప్పుల వేణారెడ్డి, దొంగరి గోవర్ధన్, తిరుమలప్రగడ రాహుల్, జనార్దన్, రాంమూర్తి, కృష్ణమూర్తి, రామచంద్రారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, దీప్లా, అజయ్‌కుమార్, రాంబాబు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సంతోష్, ఆర్ఎంపీ వైద్యులు ఉన్నారు.



అర్వపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాసాని లాలు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో లాలు మృతదేహానికి శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, బైరబోయిన సైదులు, బైరబోయిన మహరాజు, మాదగాని విక్రమ్, షావుద్దీన్, నాగరాజు, శంకర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నాగారం : మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన చిత్తలూరి అవిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, ఎల్మకంటి సోమన్న, ఆకుల ప్రతాప్, బయ్యం వెంకన్న, కొలిపాక సాయికుమార్, కంబాల మల్లేష్, పేరబోయిన ఉప్పలయ్య, రాజు, రమేష్, మహేందర్ ఉన్నారు.

గ్రామీణుల కోసం ప్రత్యేక వైద్యశిబిరాలు



లింగాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల గ్రామంలో కామినేని వైద్య కళాశాల సౌజన్యంతో స్వయం కృషి సొసైటీ, ది రైట్ వే ఆఫ్ గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 250మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యశిబిరం నిర్వాహకులు దొంగరి గోపికృష్ణ, స్వయం కృషి సంస్థ జనరల్ మేనేజర్ గడ్డం సాంబశివరావు, డైరెక్టర్ గుద్దేటి శామ్యూల్, చీఫ్ కోఆర్డినేటర్ జిల్లేపల్లి జాషువా, బిక్కుమల్ల అంజన్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయొద్దు



అర్వపల్లిలో మురుగు కాలువ శుభ్రం చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

అర్వపల్లి : మురుగు కాలువల్లో వ్యర్థాలు, వాడిన పాత సామగ్రి వేయొద్దని ఎంపీడీఓ, అర్వపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి డి.సందీప్‌కుమార్ కోరారు. అర్వపల్లిలో శనివారం గ్రామపంచాయతీ సిబ్బందితో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కాలువల్లో చెత్త, వ్యర్థాలను వేయడం వల్ల పూడిపోయి మురుగునీరు నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రావణి, సిబ్బంది లింగయ్య, యల్లయ్య, శ్రీరాములు, నర్సయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీగోదాసమేత చెన్నకేశవస్వామి ఆలయం

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలో ఈ నెల 20నుంచి నిర్వహించే శ్రీ భూగోదాసమేత చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. వేడుకలు ఈ నెల 20న అధ్యయనోత్సవాలతో ప్రారంభమై, 24న ఆరగింపు, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం కార్యక్రమాలతో ముగియనున్నాయి. ఈ నెల 20న శ్రీవిష్ణుసహస్రపారాయణం, అధ్యయనోత్సవం, తీర్థప్రసాద గోష్టి, 21న ప్రాత ఆరాధన, నమ్మాళ్వార్ పరమపద ఉత్సవం, 22న అధ్యయనోత్సవం, స్వస్తి వాచనం, విశ్వక్సేనపూజ, రక్షా బంధనం, అగ్ని ప్రతిష్ట, 23న ద్వార తోరణ పూజ, కుంభారాధన, బలిహరణము, గరుడహోమం, ధ్వజారోహణం, గరుడముద్ద కార్యక్రమాలతోపాటు రాత్రి స్వామివారి తిరుక్కళ్యాణం (శ్రీభూగోదా సమేత చెన్నకేశవస్వామి కళ్యాణం) అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 24న నిత్యహోమం, బలిహరణము, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, ధ్వజపట అవరోహణ కార్యక్రమాలతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఈఏపీసెట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ప్రతిభ

సూర్యాపేటటౌన్ : ఈఏపీసెట్ 2024 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఉత్తమ ర్యాంకు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన నిమ్మల తేజస్విని ఇంజనీరింగ్ విభాగంలో 20వేల ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని ఈ సందర్భంగా అభినందించారు.

రథానికి టార్పాలిన్ ఏర్పాటు



రథంపై కప్పిన టార్పాలిన్

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ రథశాల శిథిలమై కూలే దశకు చేరింది. దీంతో ఆలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో రథాన్ని ఉంచారు. అయితే వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ పాడవుతోంది. పరిస్థితిని స్వయంగా చూసిన డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి సుమారు రూ.17వేలతో వాటర్ ప్రూఫ్ టార్పాలిన్ కుట్టించి రథానికి వేయించారు.

నర్సరీలు, పారిశుద్ధ్య పనుల పరిశీలన



వన నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్

నూతనకల్ : ప్రభుత్వం నిర్దేశించిన హరితహారం లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ కుమార్ అన్నారు. శనివారం నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో వన నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి

నూతనకల్ : మండల పరిధిలోని అల్లునూరులో శనివారం విద్యుదాఘాతానికి గురై నాలుగు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దుండిగాల లింగరాజు తన నాలుగు గేదెలను మేతకు వదిలిపెట్టాడు. అయితే ఇటీవల వీచిన ఈదురుగాలులకు తెగిన విద్యుత్ లైన్ వైర్లు గేదెలకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. గేదెల విలువ రూ. లక్షా 50వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.